ప్రజాశక్తి

శనివారం 11 మార్చి 2023 | 5 | విజయనగరం

హక్కులపై ప్రశ్నిస్తే తప్పా?

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీకి జీతాలు ఇచ్చేలా చట్టం చేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి సూచించాలని రాష్ట్ర గవర్నర్‌ను ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అభ్యర్థిస్తే సంఘ సభ్యత్వాన్ని రద్దు చేస్తామని నోటీస్ ఇవ్వడం అన్యాయమని ఎపి జిఇఎ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.రామచంద్రరావు, కంది వెంకటరమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులు ప్రభుత్వంలో అంతర్భాగమే గాని వేరే కాదని ఆ విషయాన్ని గుర్తించాలని, బెదిరించడం ద్వారా ఉద్యోగుల పక్షాన నిలబడే సంఘాలను ఇబ్బంది పెట్టాలని చూడడం సరికాదని పేర్కొన్నారు.

ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్. సూర్యనారాయణ నాయకత్వంలో పోరాడడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఉద్యోగులకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలను నిర్లక్ష్యం చేస్తూ, ఇచ్చిన హామీ సిపిఎస్ రద్దుచేయకుండా, డిఎ ఇవ్వకుండా, పిఆర్‌సిలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, విడుదల చేసిన జీవోలు అమలు చేయకపోవడం దుర్మార్గమని అన్నారు.

శృంగవరపుకోటలో ర్యాలీ చేపడుతున్న వామపక్ష నాయకులు , పట్టణ ప్రజలు

రామభద్రపురం, బొబ్బిలిలో ఆందోళనలు చేపడుతున్న సిపిఎం నాయకులు, ప్రజలు

ఉద్యోగులపై నిర్బంధాలు అప్రజాస్వామికం

ప్రభుత్వ తీరుపై సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని ఆగ్రహం • ఉద్యోగ, ఉపాధ్యాయులకు మద్దతుగా ఆందోళనలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాలకు, అణచివేతలకు, వేధింపులకు పాల్పడటం అప్రజాస్వామికమని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మద్దతుగా సిపిఎం, సిపిఐ నాయకులు శుక్రవారం పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి దేవి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్.. పౌరుల హక్కులను, స్వేచ్ఛను హరిస్తూ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తూ స్వేచ్ఛ లేకుండా పరిపాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా ఉద్యోగులపై ఉక్కు పాదం మోపి అణచివేత ధోరణి సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. పాదయాత్రలో జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చినట్టుగా సిపిఎస్‌ను వెంటనే రద్దు చేయాలని, పెన్షనర్లకు, ఉద్యోగులకు సకాలంలోనే జీతాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు, రాజకీయ పెత్తనం వంటి విధానాలు తక్షణం ఆపకపోతే రానున్న కాలంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మద్దిల రమణ, చెలికాని ముత్యాలు, ఎర్రాప్రగడ భాస్కరరావు, శంకర్, పి.భాస్కరరావు, సిపిఐ నాయకులు మద్ది కృష్ణ, డేగల అప్పలరాజు, మోపాడ మధు, షేక్ స్వామి, వాడపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న వామపక్ష నాయకులు, కార్యకర్తలు

విజయనగరం టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులపై నిర్బంధ చర్యలు ఆపాలని కోరుతూ, వారు చేస్తున్న పోరాటాన్ని బలపరుస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.అశోక్ మాట్లాడారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులపై కక్ష కట్టిందన్నారు. వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని చెప్పి నాలుగేళ్లు అవుతున్నా నేటికీ రద్దు చేయలేదన్నారు డిఎ బకాయిలు చెల్లించాలని, ఫేస్ యాప్ పేరుతో వేధింపులు ఆపాలని, మూసి వేసిన పాఠశాలలను తెరిపించాలని, బై జ్యూస్‌తో ఒప్పందం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, కె.సురేష్, బి.రమణ, ఆర్.ఆనంద్, సిపిఐ నాయకులు రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు విడనాడాలని శుక్రవారం స్థానిక మూడు రోడ్ల జంక్షన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బలస శ్రీను మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఆనందరావు, రవ్వ ధర్మారావు, విజయ్, పరమేష్, భవానీ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సిపిఎం జిల్లా నాయకులు జి.శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ఈ మేరకు గజపతినగరంలో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను, ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేస్తోందన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలను సకాలంలో చెల్లించకుండా ప్రభుత్వం తాత్సారం చేయడం చాలా దుర్మార్గమన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా శ్రమిస్తున్న వారిని వేధించడం సరికాదన్నారు.

బొబ్బిలి : సిఐటియు ఆధ్వర్యంలో బొబ్బిలి ఎన్‌టిఆర్ బొమ్మ సెంటర్ వద్ద నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు మాట్లాడుతున్న సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తానని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీనిచ్చిన పెద్దమనిషి దగాచేశారన్నారు. ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి సిఐటియు పూర్తి మద్దతు ఇస్తుందని ప్రకటించారు. కార్యక్రమంలో యుగంధర్, బి.వెంకటి, జి.గౌరి పాల్గొన్నారు.



డిఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

నాడు హామీలు.. నేడు వేధింపులా?

డిఇఒ కార్యాలయం వద్ద యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అధికారంలో రాకముందు ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చి..నేడు వారిని వేధింపులకు గురిచేయడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని యుటిఎఫ్ నాయకులు అన్నారు ఉపాధ్యాయులపై ప్రభుత్వ వేధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన శుక్రవారం డిఇఒ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె.రమేష్‌చంద్ర పట్నాయిక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను మానసిక ఆందోళన గురి చేయడం వలన విద్యార్థుల ప్రమాణాలు దెబ్బతింటాయని అన్నారు. పాఠశాలలు ప్రారంభం నుండి బోధ నేతర పనులు పెంచేసి సంక్రాంతి సెలవులు అనంతరం విద్యార్థుల సామర్థ్యాలు బాగాలేవని చెప్పి ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయడం మంచి పరిణామం కాదని అన్నారు. నాడు-నేడు పనులు ఉపాధ్యాయులతో చేయించడం ప్రతిరోజు గూగుల్ సీట్లు నింపించడం, పరీక్షల మార్కులు అప్‌లోడ్ చేయించడం, స్టూడెంట్స్ యాప్ లో మధ్యాహ్న భోజనం నిర్వహణ, బాత్‌రూమ్‌ల నిర్వహణ, జగనన్న విద్యా కిట్లు మొదలగు అన్ని రకాల యాప్‌లను నిర్వహించి బోధనకు సమయం లేకుండా చేస్తున్నారని అన్నారు. ఇన్ని పనులు చేయిస్తూ పిల్లల విద్యా ప్రమాణాలు బాగా లేవని అధికారులు ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేయడం ,సస్పెన్షన్‌లు చేయడం తగదన్నారు. విద్యా ప్రమాణాలు మెరుగు అవ్వాలంటే ఉపాధ్యాయులకు బోధ నేతల పనులు పూర్తిగా రద్దు చేయాలని కోరారు. విద్యారంగం బాగు కోసం ఉపాధ్యాయులతోనూ మేధావులతోనూ చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు డి.రాము, జిల్లా కార్యదర్శి కె.ప్రసాద్ రావు, తిరుపతి నాయుడు, సూర్యారావు, ఎ.శంకర్రావు, ఎన్ సత్యనారాయణ, ఆనంద్, ఉపాధ్యాయులు నాయకులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి

పోలింగ్ కేంద్రంలోకి
ఓటర్లకు మాత్రమే అనుమతి

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ, ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో సొంత నిర్ణయాలు పనికిరావని స్పష్టం చేశారు. ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు సంబంధించి, ఆర్‌డిఒలు, తాహశీల్దార్లు, పోలీసు అధికారులతో ఆన్‌లైన్లో, ఎస్‌డిసిలు, ఇతర అధికారులతో ప్రత్యక్షంగా తన ఛాంబర్ నుంచి సమావేశాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటు ఉన్నవారిని మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతించాలని ఆదేశించారు. ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న ఐదు పోలింగ్ కేంద్రాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. కెమెరాలను లోపలికి అనుమతించకూడదని చెప్పారు. 12వ తేదీ ఉదయం 8 గంటలనుంచే కలెక్టరేట్‌లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ప్రారంభమవుతుందని చెప్పారు. పోలింగ్ రోజు ఉదయం 7 గంటలనుంచే వెబ్ కాస్టింగ్ ప్రారంభమవుతుందని చెప్పారు. ఎన్నికల కమిషన్ సూచించిన 14 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదాన్ని అనుమతించాలని చెప్పారు. పోలింగ్ రోజు ఉదయం 8 గంటలకల్లా ఖచ్చితంగా ఓటింగ్ ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయాలని, సాయంత్రం 4 గంటలకల్లా ఓటింగ్ ముగించడానికి ప్రయత్నించాలని చెప్పారు.

ఎస్‌పి దీపికా పాటిల్ మాట్లాడుతూ, పోలింగ్ ప్రక్రియకోసం పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 12వ తేదీ ఉదయం 9 గంటలకల్లా పోలీసు సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలని ఆదేశించారు. రూట్ ఇన్‌ఛార్జిలు ముందుగానే రూట్‌ను తనిఖీ చేసుకోవాలన్నారు. క్యూలైన్ల వద్ద ప్రచారం చేయకూడదని సూచించారు. వాహనాల ద్వారా ఓటర్లను తరలించడాన్ని అడ్డుకోవాలని చెప్పారు. ఓటు విషయంలో ఏదైనా సమస్య ఎదురైతే, వారికి ఓటును తిరస్కరించకుండా, రెవెన్యూ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, జెడ్‌పి సిఇఒ ఎం.అశోక్‌కుమార్, డిపిఒ నిర్మలాదేవి, ప్రత్యేక ఉప కలెక్టర్లు పద్మలత, వెంకటేశ్వరరావు, సుదర్శనదొర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రలోభాలే అజెండా

• ప్రజా సమస్యల ఊసే లేదు

• ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నా ప్రశ్నించని వైసిపి

• సీతంరాజు సుధాకర్‌కు పట్టభద్రుల ఓట్లడిగే హక్కుందా?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'వైసిపి తరుపున ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి బరిలో దిగిన సీతంరాజు సుధాకర్‌కు అధికార పార్టీ జెండా నీడ తప్ప ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రజా సమస్యల పట్ల ఎలాంటి అవగాహనా, అజెండా లేదు. పోరాటం చేసిన ఒక్క సందర్భమూ లేదు. ఆయనకు ఓట్లు అడిగే హక్కు ఇంకెక్కడిది' అని పలువురు పట్టభద్రులు బాహాటంగా చెప్పేస్తున్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల్లోనూ దీనిపైనే పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. పోటీలో ఉండాలంటే పార్టీ మద్దతు ఒక్కటేనా ఇతర గుణగణాలేవీ అవసరం లేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వ్యాపారాలు చేసుకుంటూ వాటి పురోభివృద్ధికి పార్టీ జెండా నీడన ముందుకెళ్లి పోవాలనుకునే నేతల్లో ఆయనొకరని చెప్పుకుంటున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి సర్కారు ప్రైవేటీకరణ చేస్తున్నా నోరుమెదపని వైనం సదరు అధికార అభ్యర్థి సొంతం. వేల సంఖ్యలో కార్మికులు, కార్మిక కుటుంబాలే కాకుండా ప్లాంట్‌పై ఆధారపడి జీవించే వేల కుటుంబాలు, వ్యాపారాలు విశాఖపట్నం ప్రత్యేకత. ఇలాంటి ప్రత్యేక పరిస్థితి చేజారిపోతున్నా పట్టని అధికార వైసిపిలో ఉన్న సదరు అభ్యర్థి స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఓట్లు అడిగే హక్కును కోల్పోయారనే చెప్పాలి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను తెగనమ్మాలని మోడీ సర్కారు కుట్రలపై కుట్రలు సాగిస్తున్నా ఉత్తరాంధ్ర పట్టభద్రుల తరపున మండలిలో ప్రశ్నిస్తానని ప్రకటించిన దాఖలా లేదు.

సమస్యలపై ఏనాడూ గళమెత్తని అభ్యర్థి

విశాఖకు అత్యంత కీలకమైన రైల్వే జోన్‌పైనా కినుక వహించడం, వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఎత్తేసినా, ఉత్తరాంధ్ర ప్రాంత ఆర్థిక పరిపుష్టిని దెబ్బ తీసే చర్యలపైనా ఏనాడూ అధికార పార్టీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా బరిలోకి దిగిన ప్రస్తుత అభ్యర్థి గళమెత్తలేదు. వెనుకబడిన జిల్లాలుగా రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే ముద్రపడ్డ శ్రీకాకుళం, విజయనగరం గ్రామీణ ప్రాంతాలకు ఎంతో కొంత ఆసరాగా నిలిచే విశాఖలోని ప్రభుత్వ రంగ సంస్థలు, విశాఖ నగరంపై ఆధారపడి జీవించే వేల కుటుంబాల జీవనాన్ని దెబ్బతీసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలున్నాయి. ఈ తరహా ప్రజా సమస్యల అజెండాపై పిడిఎఫ్ అభ్యర్థి అయిన డాక్టర్ కోరెడ్ల రమాప్రభ మినహా ప్రస్తుతం బరిలో నిలిచిన తెలుగుదేశం, వైసిపి, బిజెపి నేతలు పోరాడడం కాదు కదా కనీసం ఏ కోసానా స్పందించలేదంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఉత్తరాంధ్రకు రూ.వేల కోట్లు ఆర్థిక ప్యాకేజీ కేంద్రంలోని బిజెపి ఇస్తానని ఇవ్వకుండా మోసం చేసినా రాష్ట్రంలో 2019లో పగ్గాలు చేపట్టిన వైసిపి ఏనాడూ ప్రశ్నించలేదు. ఆ పార్టీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఇవేమీ పట్టడమే లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడం, ప్రశ్నిస్తే వేధింపులకు గురిచేయడం వంటి సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఏ ముఖం పెట్టుకుని వారిని అధికార వైసిపి ఓట్లడగడానికి వెళ్తోంది అంటూ పట్టభద్రులే ప్రశ్నిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ప్రలోభాలు.. పంపకాలే

చేతిలో అధికారం ఉండడంతో ఉద్యోగులు, అధికారులపై బెదిరింపులకు పాల్పడడం, ఎయు వైస్ ఛాన్సలర్ హోటల్‌లో ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ప్రజా సంఘాలకు దొరికిపోవడం తెలిసిందే. ప్రభుత్వ వైన్ షాపుల్లోని సూపర్ వైజర్లు సైతం అధికార పార్టీకి అనుకూలంగా ఓటు వేయాలంటూ శుక్రవారం సాయంత్రం విశాఖ ఉత్తర నియోజకవర్గంలో అధికార పార్టీ నేత కెకె.రాజు ఆధ్వర్యాన సమావేశం నిర్వహించిన వీడియో బయటపడింది. ఉత్తరాంధ్ర ప్రాంతమంతటా తెలంగాణ రాష్ట్ర స్టిక్కర్లుండే కార్లను వినియోగించి వెండి వస్తువులను బహుమతులుగా శుక్రవారం సాయంత్రం సీతంరాజు సుధాకర్ తన ఇంటి నుంచి పంపిస్తున్న వీడియో, ఫొటోలు కూడా బయటపడ్డాయి. ఇవన్నీ అధికారిక అక్రమాలే. వీటన్నింటిపైనా జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారిగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

13న పోలింగ్‌లో బుద్ధిచెప్పడం ఖాయం

అధికార వైసిపి కేవలం తన శక్తియుక్తులన్నీ ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, డబ్బు, ఇతర బహుమతులను పంపిణీ చేసే అంశాలపైనే దృష్టిసారించింది. చెప్పడానికి అజెండా లేదు. దొడ్డిదారులు, దొంగ పనులపైనే ఆ పార్టీ కార్యాచరణ ఉన్నట్టు కనిపిస్తోంది. వాటిని పట్టభద్రులు చైతన్యంతో తిప్పికొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఎక్కడికక్కడే వారి ఎత్తులను చిత్తు చేస్తున్నారు. పోలింగ్ రోజైన ఈనెల 13న ఇదే ప్రతిబింబించనున్నదని పలువురు చెబుతున్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

సెంచూరియన్ యూనివర్సిటీ విసి జిఎస్ఎన్ రాజు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు అన్నారు. శుక్రవారం సెంచూరియన్ యూనివర్సిటీలో అంతర్ విశ్వ విద్యాలయాల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంచేందుకు ఉపయోగపడతాయన్నారు. ఈ నెల 13వ తేదీ వరకు వివిధ రకాల క్రీడా పోటీలు ఉంటాయన్నారు. ఎక్కువ బంగారు పతకాలు సాధించిన వారికి అదనంగా తాను రూ.5 వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తానని ప్రకటించారు. అనంతరం 100 మీటర్ల పరుగు పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ తరంగ్ మేనేజింగ్ డైరెక్టర్ బాబు శంకర్, ఒడిశా క్యాంపస్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా ప్రసాద్ పాడి, స్పోర్ట్స్ డైరెక్టర్ రవి నారాయణ్ రౌత్రే, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ఎస్ వర్మ, డాక్టర్ సన్నీ డియోల్, స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణ పాల్గొన్నారు.

100 మీటర్ల పరుగు పందెంలో విజేతలు

పోలీసుల సమస్యలపై 'దర్బార్'

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులకు ప్రతీ సంవత్సరం 15 రోజులపాటు నిర్వహించే పునశ్చరణ తరగతులు శుక్రవారం ముగిసాయి. ఈ కార్యక్రమానికి ఎస్‌పి ఎం.దీపిక ముఖ్య అతిథిగా హాజరై ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుల సమస్యల పరిష్కా రానికి దర్బార్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ – పోలీసు విధులను నిర్వహించేటప్పుడు నిష్పక్షపాతంగా, నిజాయితీతో వ్యవహరించి, ప్రజలకు మరింత చేరువ కావాలన్నారు. విధుల్లో మరింత నైపుణ్యాన్ని సాధించేందుకు ప్రతీ ఏడాది నిర్వహించే పునశ్చరణ తరగతులు పోలీసుల శారీరక ధారుడ్యాన్ని, వివిధ తుపాకుల వినియోగం పట్ల అవగాహన పెంచుకోవడానికి, వత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చు కోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. దర్బార్లో పోలీసు సిబ్బంది సంక్షేమానికి చేపట్టాల్సిన చర్యలు, విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను, ఇబ్బందులను ఎస్‌పి దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి ఎస్‌పి అక్కడికక్కడే చర్యలు చేపట్టారు. పోలీసు ఉద్యోగుల కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఇచ్చే రుణాలపై వడ్డీని మరింత తగ్గించేందుకు, మన్యం జిల్లాలో విధులు నిర్వహించే సిబ్బందికి

మాట్లాడుతున్న ఎస్‌పి ఎం.దీపిక

ఎ.ఎన్.ఎస్. మంజూరు చేసేందుకు, సిబ్బంది లభ్యతను సమీక్షించి వీక్లీ ఆఫ్ అమలు చేసేందుకు, అనారోగ్య కారణాలతో విధులు నిర్వహించే సిబ్బందికి సరళమైన విధులకు వినియోగించేందుకు, రిజర్వు సిబ్బందికి వాహన సదుపాయం కల్పించేందుకు, వెయింటింగులో ఉండే పోలీసు సిబ్బంది విశ్రాంతి తీసుకొనేందుకు ప్రత్యేక విశ్రాంత గదులు, సదుపాయాల కల్పనకు, చాలా కాలంగా వివిధ డ్యూటీల్లో డిప్యూటేషన్ పై పని చేస్తున్న సిబ్బంది స్థానే కొత్త వారికి అవకాశం కల్పించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి ఎల్.శేషాద్రి, విజయనగరం ఇన్చార్జి డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, ట్రాఫిక్ డిఎస్‌పి ఎల్.మోహనరావు, ఆర్.ఐ. బి.రమణమూర్తి, సిఐలు, పాల్గొన్నారు.

వ్యవసాయం లాభసాటి కావాలి

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి : జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా చేయాల్సిన అవసరం ఉందని, దీనికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. మారుతీ కంపెనీ తయారు చేసిన వ్యవసాయ డ్రోన్ ఎజి365 అగ్రికాప్టర్‌పై, గాజులరేగ వ్యవసాయ పరిశోధనా స్థానంలో నాబార్డ్ ఆధ్వర్యంలో శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. కంపెనీ ప్రతినిధులు ఈ డ్రోన్ గురించి వివరించి, పొలంలో ఎగురవేసి, ఎరువులను పిచికారీ చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమానికి హాజరైన జెసి మయూర్ అశోక్ మాట్లాడుతూ, వ్యవసాయంలో ఉత్పత్తి, ఉత్పాదకత పెరగాలంటే, కొత్త పద్ధతులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాల్సి ఉంటుందని అన్నారు. ఆధునిక పరిజ్ఞానాన్ని, సాంకేతికతను వ్యవసాయానికి వినియోగించడం వల్లే విదేశాల్లో వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయని, మనకంటే రెట్టింపు ఉత్పత్తి జరుగుతోందని చెప్పారు. మన దగ్గర కొత్త పద్ధతులను, ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించడమే కాకుండా, మార్కెటింగ్ సౌకర్యాలను మరింత మెరుగుపర్చాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. చిన్న, సన్నకార రైతులు తమ ఉత్పత్తులకు తగిన గిట్టుబాటు ధర రావాలంటే, రైతు సంఘాలుగా ఏర్పడాలని సూచించారు. దీనివల్ల బేరం ఆడే శక్తి పెరుగుతుందన్నారు. పంటలను ప్రాసెస్ చేయడం, ప్యాకేజ్ చేయడం ద్వారా, వాటికి అదనపు విలువ సమకూరుతుందని, తద్వారా చక్కని గిట్టుబాటు ధరలను పొందవచ్చునని జెసి సూచించారు. డ్రోన్ లాంటి ఖరీదైన పరికరాలను కొనుగోలు చేయాలంటే, చిన్నసన్నకార రైతులకు సాధ్యం కాదని, సంఘంగా ఏర్పాటై కొనుగోలు చేస్తే అందరికీ ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.టి.రామారావు, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, నాబార్డు డిడిఎం నాగార్జున, శ్రీనివాసరావు తదితర వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, రైతుసంఘాలు, వ్యవసాయ విద్యార్థులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డ్రోన్‌ను పరిశీలిస్తున్న జెసి అశోక్, శాస్త్రవేత్తలు

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- 72 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- జిల్లాకు చేరుకున్న బ్యాలెట్ పత్రాలు
- ఓటుహక్కు వినియోగించుకోనున్న 58,502 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం 72 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. విజయనగరం డివిజన్‌లో 42, బొబ్బిలిలో 13, చీపురుపల్లిలో 17 చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. ఒక్క విజయనగరం పట్టణంలోనే 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి.

ఎన్నికల సామగ్రి పంపిణీ

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం అవసరమైన సామాగ్రిని పంపిణీ చేసేందుకు ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు మూడు డివిజన్ కేంద్రాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. విజయనగరం డివిజన్‌కు ఆర్‌డిఒ కార్యాలయంలోనూ, చీపురుపల్లికి సంబంధించి ఎస్.డి.ఎస్.కళాశాల, గరివిడిలోనూ, బొబ్బిలి తహశీల్దార్ కార్యాలయంలోనూ ఎన్నికల సామాగ్రి పంపిణీకి ఏర్పాట్లు చేశారు. మార్చి 12న ఉదయం 8 గంటల నుంచే సామాగ్రి పంపిణీకి అన్ని ఏర్పాట్లు సిద్ధంచేశారు. ఎన్నికల సామాగ్రి పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు 15 ఆర్టీసీ బస్సులను కూడా ఏర్పాటు చేశారు.

ఎన్నికల సిబ్బంది నియామకం

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సజావుగా జరిపేందుకు తగిన సంఖ్యలో పోలింగ్ సిబ్బందిని కూడా జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నియమించారు. 72 పోలింగ్ కేంద్రాలకు 72 మంది పిఒలతో పాటు రిజర్వులో మరో 18 మందిని పిఒ విధులు నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్నారు. 72మంది ఎపిఒలు 18 మంది రిజర్వు ఎపిలు, 144 మంది ఒపిఒలు, మరో 41 మంది రిజర్వు సిబ్బందిని నియమిస్తున్నారు. వీరందరికీ ఇప్పటికే

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పోలింగ్‌కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికకోసం మార్చి 13న పోలింగ్ జరుగనుంది. ఆరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఓటర్లందరికీ బిఎల్‌ఒల ద్వారా ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు.

జిల్లాలో 58,502 మంది పట్టభద్ర ఓటర్లు వుండగా వీరికోసం జిల్లా యంత్రాంగం 72 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో మొత్తం ఓటర్లలో 38,625 మంది పురుషులు, 19,868 మంది మహిళా ఓటర్లు, 9మంది థర్డ్‌జెండర్ ఓటర్లు వున్నారు. విజయనగరం డివిజన్‌లో అత్యధికంగా 33,643 ఓటర్లు వుండగా, చీపురుపల్లిలో 14,256 మంది, బొబ్బిలిలో 10,603 మంది ఓటర్లు ఉన్నారు.

శిక్షణ కార్యక్రమాలు పూర్తిచేసి ఉత్తర్వులు కూడా జారీచేశారు. జిల్లాను 13 జోన్లుగా విభజించి 13 మంది జోనల్ అధికారులను నియమించారు. దీంతోపాటు 13 రూట్లుగా విభజించి 24 మంది రూట్ అధికారులను నియమించారు.

మైక్రో అబ్జర్వర్ల నియామకం

ఎన్నికలు సక్రమంగా, సజావుగా జరిగేలా తగిన పర్యవేక్షణ చేసే నిమిత్తం ఎన్నికల సంఘం 72 మంది కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మైక్రో అబ్జర్వర్లగా నియమించింది. వీరికి అదనంగా మరో 18 మంది రిజర్వు అబ్జర్వర్లను కూడా నియమించారు. పోలింగ్ తీరును గమనించి దీనిపై ఎన్నికల సంఘానికి వీరు నివేదికలు అందజేస్తారు. వీరికి ఇప్పటికే రెండు విడతల శిక్షణ కూడా పూర్తిచేశారు.

బ్యాలెట్ బాక్సులు, పేపర్లు సిద్ధం

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం జిల్లాకు 229 పెద్ద సైజు బ్యాలెట్ బాక్సులను ఎన్నికల సంఘం సరఫరా చేసింది. వీటికి అదనంగా మరో 100 రిజర్వు బ్యాలెట్ బాక్సులు కూడా సరఫరా చేశారు. ఎన్నికల పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ పత్రాలను ఇప్పటికే జిల్లా కేంద్రానికి చేర్చారు. బ్యాలెట్ పత్రాల తనిఖీ కూడా జిల్లా స్థాయిలో పూర్తిచేసి స్ట్రాంగ్ రూంలో ఉంచారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

పోలింగ్ రోజున ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సరళిని పరిశీలించేందుకు జిల్లా పరిషత్ సిఇఒ. ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి రెండు గంటలకు నమోదైన ఓట్లను తెలుసుకోవడంతో పాటు ఆయా కేంద్రాల్లో పోలింగ్ జరుగుతున్న విధానం, ఎక్కడైనా శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమయ్యిందీ లేనిదీ వంటి సమస్యలు కూడా తెలుసుకుంటారు. జిల్లా కలెక్టర్ ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచే ఎన్నికల పర్యవేక్షణ చేస్తారు.

పోలింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు

జిల్లాలో ఏర్పాటు చేసిన 72 పోలింగ్ కేంద్రాల్లోనూ సిసి కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికల సరళిని వర్చ్యువల్ గా పరిశీలించేందుకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. 72 కేంద్రాల్లోనూ సిసి కెమెరాలను ఏర్పాటు చేసి పోలింగ్ జరుగుతున్న తీరును జిల్లా కేంద్రం నుంచి కలెక్టర్ తదితరులు పర్యవేక్షిస్తారు.

రిసెప్షన్ సెంటర్

పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్సులు తరలించి భద్రపరిచేందుకు కలెక్టర్ కార్యాలయంలో రిసెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అన్ని ప్రాంతాల నుంచి బ్యాలెట్ బాక్సులు చేరిన తర్వాత వాటిని స్ట్రాంగ్‌రూంలో భద్రపరచి ఇక్కడి నుంచి విశాఖకు తరలించే ఏర్పాట్లు చేస్తారు.

స్వేచ్ఛగా ఓటువేసే వాతావరణ కల్పిస్తున్నాం : జిల్లా కలెక్టర్

ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించేకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం చేస్తోందని జిల్లా కలెక్టర్ సూర్యకుమారి పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా ఉదయం వేళల్లోనే ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు ప్రయత్నించాలని సూచించారు. ప్రతి ఓటరు తమకు అందజేసిన ఓటరు స్లిప్పును తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు. తద్వారా ఓటరు జాబితాలో పేర్లను త్వరగా గుర్తించి సమయం ఆదా అవుతుందన్నారు.

పటిష్ట బందోబస్తు

పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్లు దూరంలోనే టెంట్లు : ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ఈనెల 13న నిర్వహించబోవు ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలను సజావుగా, ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. జిల్లాలో 31 ప్రాంతాల్లోని 72 పోలింగు కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు భద్రత చర్యలు చేపట్టామన్నారు. ప్రతీ పోలింగు కేంద్రం వద్ద ఎస్‌ఐ స్థాయి అధికారిని నియమించామని, బందోబస్తు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఉన్నతాధికారులను నియమించామన్నారు. అంతేకాకుండా, 5 కంటే ఎక్కువ పోలింగు కేంద్రాలు ఉన్న లొకేషనులో మరింత భద్రత చర్యలు చేపట్టామన్నారు. బందోబస్తు నిమిత్తం ఒక అదనపు ఎస్‌పితో సహా ఐదుగురు డిఎస్పీలు, 20 మంది సిఐలు, 67 మంది ఎస్‌ఐలు, 90మంది ఎఎస్‌ఐలు, 222మంది హెడ్ కానిస్టేబుళ్ళు, 552మంది కానిస్టేబుళ్ళు, 106 మహిళా కానిస్టేబుళ్లను బందోబస్తు నిమిత్తం వినియోగిస్తున్నామన్నారు. వీరు కాకుండా, ఆర్మ్ రిజర్వు, ఎపిఎస్‌పి, ఎస్‌టిఎఫ్, హోంగార్డులతో సుమారు 1500 మందిని ఎన్నికల నిర్వహణ భద్రత, బందోబస్తు విధుల్లో వినియోగిస్తున్నట్లు తెలిపారు. 13రూట్ మొబైల్స్, 18 స్ట్రైకింగు ఫోర్సులను, 6 స్పెషల్ స్ట్రైకింగు ఫోర్సులను కూడా ఏర్పాటు చేసామన్నారు. జిల్లాలో ఆరు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, నిరంతరం వాహనాల తనిఖీలు చేపడుతున్నామన్నారు.

పోలింగు కేంద్రాలు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సిఆర్‌పిసి, సెక్షన్ 30 పోలీసు చట్టం అమలులో ఉంటున్నందున ఎవరూ గుంపులుగా ఉండవద్దని, ప్రజలందరూ భద్రతా సిబ్బంది సహకరించాలని కోరారు. పోలింగు కేంద్రాలకు 200మీటర్లు దూరంలో ఎటువంటి టెంటులు వేయకుండా చూడాలని, రెవెన్యూ సిబ్బంది సహకారంతో లైన్లు ఏర్పాటు చేయాలని భద్రత అధికారులను ఎస్‌పి ఆదేశించారు.

జానపద కళలను భావితరాలకు అందించాలి

ప్రజాశక్తి- విజయనగరం కోట

మన సంస్కృతి సాంప్రదాయాలకు నిలయమైన జానపద కళలను భావితరాలకు అందించాలని జానపద కళాపీఠం అధ్యక్షులు బద్రి కూర్మారావు అన్నారు. శుక్రవారం స్థానిక విజయనగరం ఖాదర్ వలి బాబా 64వ ఉసురు మహోత్సవాల్లో భాగంగా దర్గాలో తప్పిటగుళ్లు, పులి వేషాలు, ఫకీర్ మేళా, బిందెల డాన్స్ కోలాటం, బుర్రకథలు ప్రదర్శించారు. ఖాదర్ వాలి బాబా జీవిత చరిత్రను మజ్జి గౌరి బుర్రకథ బృందం అద్భుతంగా ప్రదర్శించింది. ఈ సందర్భంగా బద్రి కుర్మారావు మాట్లాడుతూ అంతరించిపోతున్న జానపద కళలను దర్గా పెద్దలు ప్రతి ఏటా ప్రదర్శింపజేయడం సంతోషమన్నారు.

అనధికారిక ల్యాబ్‌లపై చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో అనధికారకంగా నడుపుతున్న డయాగ్నోస్టిక్స్, హై ఎండెడ్ లాబ్స్, డెంటల్ క్లినిక్‌లు, ఫిజియోథెరపీ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డిఎంహెచ్‌ఒ ఎస్‌వి రమణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. తప్పనిసరిగా www.clinicalesttact.ap.gov.inలో క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ చట్టాన్ని అనుసరించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-కొత్తవలస

ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని జోనల్ అధికారి బి.అరుణకుమారి తెలిపారు. శుక్రవారం కొత్తవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓటు హక్కును వినియోగించడానికి వచ్చిన వికలాంగులకు సహాయం చేయాలన్నారు. కార్యక్రమంలో కొత్తవలస సిఐ ఎస్.బాలసూర్యారావు, డిప్యూటీ తహశీల్దార్ హర్షవర్ధని, ఎన్నికల జోనల్ ఆఫీసర్ రమేష్, రూట్ ఆఫీసర్ ఎన్‌డి కిషోర్, స్కూల్ హెచ్‌ఎం బండారు శ్రీనివాసరావు, ఎఎస్‌ఐ బి.శ్రీనివాసరావు, విఆర్‌ఒ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్‌హబ్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులకు శుక్రవారం ఏర్పాటుచేసిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారికి జిల్లా ఉపాధి అధికారి డి.అరుణకుమారి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.గోవిందరావు, రాజీరామ్ కంపెనీ సిఇఒ కిరణ్‌కుమార్ నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో సీడాప్ జెడిఎం డి.మార్టిన్ లూథర్, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి భాస్కరరావు, డిఎస్‌డిఒ షణ్ముఖరెడ్డి, కోఆర్డినేటర్లు భాస్కరరావు, శాంతి ప్రియ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ

వల్లంపూడి కూడలిలో బస్‌షెల్టర్ వద్ద గ్రామ సచివాలయ సిబ్బంది శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి దృష్ట్యా వివిధ పనులకు మండల కేంద్రంలో కార్యాలయాలకు వచ్చే వారి కోసం చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.భాగ్యలక్ష్మి, మహిళా కానిస్టేబుల్ ధనలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బానాది, బల్లంకి గ్రామాల్లోని పాఠశాలలను శుక్రవారం ఎంఇఒ శ్రీదేవి సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ అమల్లో లోపాలు లేకుండా చూడాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

ఎస్‌డబ్ల్యుపిసి పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్

మండలంలోని ఎకెజిపాలెం, ఎన్‌కెఆర్‌పురం గ్రామాల్లో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, ఇఒపిఆర్‌డి సిహెచ్. సూర్యనారాయణ శుక్రవారం పర్యటించారు. ఎకెజి పాలెంలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని, ఎన్‌కెఆర్‌పురంలో గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచినప్పుడే ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారని వారు తెలిపారు. అందుకు పూర్తి బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని చెప్పారు.

ఆతవలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఆతవ గ్రామంలో శుక్రవారం వైఎస్‌ఆర్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ధరణి నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ధరణి కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది ఎఎన్‌ఎం దేవి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

తిరుమల మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక శ్రీ ఆదిత్య విద్యాలయంలో చిన్నమాంబ సేవ యువజన సంఘం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసింది. శిబిరంలో రోగులకు షుగర్, బిపి, ఇసిజి పరీక్షలు చేశారు. డాక్టర్ చంద్రకుమారి గుండె సంబంధిత తనిఖీలు నిర్వహించారు. ఈ శిబిరానికి సుమారు వందమంది హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సూరిబాబు, ప్రధానోపాధ్యాయులు వి.అమృత, తిరుమల మెడికవర్ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కలను పట్టొద్దు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలో గత వారం రోజులుగా కుక్కలను పట్టవద్దని, వాటిని చంపుతున్న వారిపై కేసులు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ జంతు సంక్షేమ రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ ఉంటుండగా, నోరులేని మూగ జీవాలు అయిన కుక్కలను చంపడానికి తమిళనాడు నుంచి వేటగాళ్ళను తీసుకు వచ్చి గత వారం రోజులుగా అన్ని వార్డులలో తిరుగుతూ కర్రలు, రాడ్లు పట్టుకొని కరెంట్ తీగలతో వాటికి ఉరి వేస్తూ జనాలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవిఆర్ సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి చీడి రామకష్ణ పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ కోరారు. శుక్రవారం పట్టణంలో ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో రమాప్రభకు మద్దతుగా ప్రజా సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలపైన పోరాడుతున్న కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటేయాలని కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటంలో భాగస్వామ్యమైన రమాప్రభ గెలుపు ఉద్యమం బలోపేతానికి దోహదపడుతుందన్నారు. పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి ఉద్యమాలకు మద్దతు పలుకుతున్న రమాప్రభను గెలిపించి శాసనమండలికి పంపించాలని కోరారు.

కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు తమ్మినేని, తదితరులు

నెల్లిమర్ల : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మద్దతు ఇవ్వాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. నగర పంచాయతీతోపాటు పలు గ్రామాల్లో సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు కిల్లంపల్లి రామారావు, అరసాడ నారాయణరావు, కె.శ్రీనివాస్ ప్రచారం నిర్వహించారు.

రమాప్రభకు జనసేన మద్దతు

బొబ్బిలి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు జనసేన మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా పాలనలో వైసిపి పూర్తిగా విఫలమైందని చెప్పారు. ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. వైసిపి అభ్యర్థిని ఓడించి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే పిడిఎఫ్ ను గెలిపించాలని కోరారు. బొబ్బిలి నియోజకవర్గంలో జనసేన కార్యకర్తలు, అభిమానులు కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి-బొబ్బిలి

తాగునీటి కోసం శుక్రవారం పట్టణంలోని ఏడో వార్డులో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా కౌన్సిలర్ దిబ్బ సునీత మాట్లాడుతూ ఏడో వార్డులో ఎనిమిది రోజుల నుంచి తాగునీరు సరఫరా చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎనిమిది రోజులుగా తాగునీరు ఇవ్వకపోతే ఎలా జీవించాలని ప్రశ్నించారు. తాగునీటి కోసం అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

పట్టణంలో తాగునీటి సరఫరా పునరుద్ధరించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బలిజిపేట రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పాత పైపులైన్‌కు నూతన పైపులైన్ అనుసంధానం చేయడం వల్ల తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. రోడ్డుకు ఎడమ వైపు పనులు పూర్తయిన ప్రాంతానికి తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. ఈ నెల 9న కొన్ని ప్రాంతాలకు, 10న మిగిలిన ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేశామన్నారు.

అంగన్వాడీల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూరల్ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిడిపిఒ విజయలక్ష్మికి ఉమ్మడి సెలవు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు మాట్లాడుతూ అంగన్వాడీలకు పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా పెంచాలని వేతనాలు పెంచాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలపై సచివాలయాల పర్యవేక్షణ పేరుతో వేధింపులకు పాల్పడవద్దన్నారు. ఫేస్ యాప్ రద్దు చేయాలని, వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్ల సాధనకు ఈ నెల 20న అంగన్వాడీలు మాస్ లీవ్ పెడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జి.జ్యోతి, పి.నిర్మల, ఉమ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఒత్తిడికి గురిచేయొద్దు

కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

ఏప్రిల్‌లో జరగనున్న 10వ తరగతి పరీక్షలలో జిల్లాలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ ఎ.సూర్య కుమారి తెలిపారు. ప్రీ ఫైనల్ పరీక్షల్లో. విద్యార్థుల మార్కులను బట్టి సబ్జెక్ట్ వారీగా విశ్లేషించుకొని ఫలితాలు మెరుగ్గా వచ్చేలా చూడాలని తెలిపారు. శుక్రవారం టీమ్ కాన్ఫరెన్స్ ద్వారా మోడల్ స్కూల్స్, కెజిబివి, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్ తో మాట్లాడారు. ప్రీఫైనల్ పరీక్ష ల్లో సబ్జెక్ట్ వారీగా ఫెయిల్ అయిన వారు ఏ కారణంగా ఫెయిల్ అయ్యారని వివరణ అడిగారు. ఏయే సబ్జెక్టుల్లో వెనకబడి ఉన్నారో వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, అదనపు ప్రిపేరేషన్ తరగతులను నిర్వహించాలని అదేశించారు. ప్రాక్టీస్ సెషన్ పేరుతో పిల్లలపై అధిక వత్తిడి పెట్టవద్దని, వారి సమర్థతను బట్టి దగ్గరే వుండి వారిని చైతన్య పరచి, వారితో చదివించాలని స్పష్టం చేసారు. ఉన్నత చదువులు చదివే స్తోమత, సమర్థత లేని వారికి పాలిటెక్నిక్‌కు అప్లై చేయించాలని అన్నారు. కెరీర్ గైడెన్స్ పై కూడా వారికి అవగాహన కలిగించాలన్నారు. టెన్త్, ఇంటర్ విద్యార్థులకు అవసరమగు కాస్ట్ సర్టిఫికెట్ల కోసం సచివాలయంలో ఇపుడే దరఖాస్తు చేయాలని, తదుపరి అడ్మిషన్స్ కు ఇబ్బంది లేకుండా ఉండేలా చూడాలని అన్నారు. సమావేశంలో డిఇఒ లింగేశ్వర రెడ్డి, జిల్లా సోషల్ వెల్ఫేర్ రేసిడెంటిల్ స్కూల్స్ కోర్డినేటర్ చంద్రావతి పాల్గొన్నారు.

రైతులకు తీవ్ర అన్యాయం : టిడిపి

ప్రజాశక్తి-గరివిడి

ఆర్‌ఇసిఎస్‌ను ఎపిఇపిడిసిఎల్‌లో విలీనం చేసి రైతులకు తీవ్ర అన్యాయం చేశారని టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున తెలిపారు. శుక్రవారం చీపురుపల్లిలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 30 వేల వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఉంటే, చీపురుపల్లి ఆర్‌ఇసిఎస్ పరిధిలోనే పది వేల కనెక్షన్లు ఉన్నాయని చెప్పారు. ఇలా రైతులకు ఎంతో ఉపయోగపడే ఆర్‌ఇసిఎస్‌ను ఎపిఇపిడిసిఎల్‌లో విలీనం చేసి చీపురుపల్లి నియోజకవర్గ రైతులకు తీవ్ర అన్యాయం చేశారని చెప్పారు. ఆర్‌ఇసిఎస్ విలీనంపై ప్రజా పోరాటానికి మంత్రి బొత్స సత్యనారాయణ మద్దతు తెలపకుండా, విలీనం చేయడంలో భాగమయ్యారని దుయ్యబట్టారు. నియోజకవర్గ ప్రజల ఆగ్రహానికి మంత్రి గురికాక తప్పదని హెచ్చరించారు. సంస్థలో 59 ఉద్యోగాల నియామకంలో అవినీతి జరిగిందని సొంత పార్టీ ప్రజా ప్రతినిధులే ఆరోపించారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో నాయకులు రౌతు కాము నాయుడు, దన్నాన రామ చంద్రుడు, శనపతి శ్రీను, దన్నాన సూరప నాయుడు, గవిడి నాగరాజు, అరతి సాహు, రెడ్డి లక్ష్మణరావు, మీసాల శ్రీధర్ నాయుడు, రేగిడి వాసు పాల్గొన్నారు.

బల్లంకి సచివాలయంలో ఒక్కరే!

ప్రజాశక్తి-వేపాడ



విధులు నిర్వర్తిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ (వృత్తంలో)

మండలంలో బల్లంకి గ్రామ సచివాలయంలో 11 మంది ఉద్యోగులకు గాను శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఒక్కరే దర్శనమిచ్చారు. వెల్ఫేర్ అసిస్టెంట్ ఒక్కరే విధులు నిర్వర్తిస్తూ కనిపించారు. మిగతా సిబ్బంది గురించి వెల్ఫేర్ అసిస్టెంట్‌ను ఆరాతీస్తే, పొంతన లేని సమాధానాలు చెప్పడం గమనార్హం. గతం నుంచీ ఇదే పరిస్థితి. సమయపాలన పాటించి విధులకు సక్రమంగా హాజరుకావాలని మండల స్థాయి నుంచి జిల్లా అధికారుల వరకు చెబుతున్నారు. కానీ అవేవీ ఇక్కడి ఉద్యోగులకు పట్టడం లేదు. సచివాలయ సిబ్బంది పనితీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకుని సిబ్బంది కార్యాలయానికి సక్రమంగా హాజరయ్యేలా చూడాలని కోరుతున్నారు.

ఉన్నత విలువలు కలిగి ఉండాలి

ఎయు ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- భోగాపురం

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

విద్యార్థులు ఉన్నత విలువలతో ముందుకు సాగాలని ఆంధ్రా యూనివర్శిటీ హెడ్ ఆఫ్ ద న్యూక్లియర్ ఫిజిక్స్ ప్రొఫెసర్ పివి లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని లెండి డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫేర్వెల్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలలో మంచి విద్యావకాశాలు ఉన్నాయని, ప్రతి విద్యార్థి ఉన్నత చదువులకు యూనివర్సిటీలో చేరాలని కోరారు. ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా అనేక ప్లేస్మెంట్స్ వస్తున్నాయని చెప్పారు. విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని, నిరుత్సాహ పడకుండా ముందుకు సాగాలని సూచించారు. ప్రతి ఓటమి ఒక గుణపాఠంగా ముందుకు సాగాలని తెలిపారు. అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం దక్కుతుందన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు, కళాశాల ప్రిన్సిపల్ కిరణ్, శ్రీనివాస విద్యాసంస్థల చైర్మన్ పతివాడ రమణ, జెవిఎస్ విద్యాసంస్థల చైర్మన్ ఎంఎస్‌ఎన్ రాజు, కళాశాల డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి- కొత్తవలస

మండలంలోని కంటకాపల్లి పంచాయతీ రెల్లి కాలనీలో మేడిశెట్టి సత్తిబాబుకు చెందిన ఇల్లు విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం దగ్ధమైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ సంఘటన జరగడంతో ఇంట్లో ఉన్న సామాగ్రి మొత్తం కాలి బూడిదైంది. గ్రామ సర్పంచ్ భర్త మదిన అప్పల రాం, విఆర్‌ఒ కాకర మల్లేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకొని ఆస్తి నష్టం అంచనా వేశారు. కుటుంబమంతా కట్టు బట్టలతో మిగిలారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి

విజయనగరం టౌన్ : కలెక్టరేట్ జంక్షన్ వద్ద ఉన్న సావిత్రిబాయి పూలే విగ్రహానికి జిల్లా జాతీయ బిసి సంఘం నేతలు పూలమాలవేసి నివాళులు అర్పించారు. అధ్యక్షులు గదుల వెంకటరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముడిలి నాగభూషణం, వర్కింగ్ ప్రెసిడెంట్ చోడి ఆదినారాయణ, కార్యదర్శి పందిరి లక్ష్మారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, గువ్వల రవి, దువ్వ వేణు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా వల్లంపూడి కూడలిలో శుక్రవారం ఆమె చిత్రపటానికి దళిత మహాసభ మండల అధ్యక్షులు కె.రాము పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుత్తు శ్రీను, పొడుగు పైడిరాజు, పొడుగు వీరేశు, జి.అప్పలరాజు, సిహెచ్.మనం పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మరొకరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సంజీవిమెట్ట వద్ద గురువారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలోని సంజీవపురం గ్రామానికి చెందిన కొటాన అప్పలనాయుడు (48) గురువారం రాత్రి కడుపునొప్పితో బాధపడుతూ మందుల కోసం ద్విచక్రవాహనంపై అదే గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి నాయుడుతో కలిసి దేవరాపల్లి వెళ్లాడు. తిరిగి గ్రామానికి వస్తుండగా వేపాడ మండలంలోని సంజీవిమెట్ట వద్ద కొత్తవలస- దేవరాపల్లి రోడ్డుపై ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరిద్దరూ తీవ్ర గాయాల పాలయ్యారు. ఎదురుగా వచ్చి ఢీకొట్టిన వ్యక్తి ద్విచక్రవాహనాన్ని వదిలి పరారయ్యాడు. క్షతగాత్రులిద్దరినీ 108 వాహనంలో కె.కోటపాడు ఆస్పత్రికి స్థానికులు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అప్పలనాయుడు మృతిచెందాడు. అప్పలనాయుడు భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్ఐ కె.రాజేష్ కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
S.O.P. 1 / 2023

Between:
1.Vuppala Sridevi, W/o. Ramakrishna, D.No. 1-47-9/3, Sector-1, M.V.P.Colony, Near Netaji Park, L.B.Colony, Visakhapatnam.
2. Digumarthi Varalakshmi, W/o. D.Chandra Kaladhar, D.No. 23-7-6, Vellurivari Veedhi, Vizianagaram.
3. Cheemalakonda Seetha Ramalakshmi W/o. Balaji Kumar, D.No. 1-73, Mainroad, Medapadu, East Godavari District ...Petitioners
And:
Nil ... Respondents

NOTICE

నా క్లయింట్లు అయిన పిటీషనర్ల తల్లి ముక్కు శేషారత్నం, భర్త లేటు బంగారు కృష్ణారావు తే:09-03-2022దీన కాలం చేసియున్నారు. ఆమె యొక్క వారసులయిన పిటీషనర్లే కాకుండా, వేరే వారసులున్నా, అభ్యంతరం తెలియజేయ గోరు వారు **తే: 28-03-2023దీన** గౌరవ సీనియర్ సివిల్ జడ్జి విజయనగరం కోర్టు వారి ముందు **ఉదయం 10-30 గంటలకు** మీరు గాని మీ తరవు వకీలు గాని అభ్యంతరము తెలియజేయవచ్చు.

బి.గౌరీశంకరరావు
అడ్వకేట్, విశాఖపట్నం.
సెల్ : 9908035527

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, AT: VISAKHAPATNAM
E.P.402/2019 in O.S.240/2014

Between :
Angajala Usha Annapoorna & Another ...D.Hr/ Plaintiff
And:
Sri Angajala Raghu Kumar ...J.Dr/Defenant

Notice under Order 21 Rule 54 of C.P.C

To, **JDR:**
Sri Angajala Raghu Kumar,
S/o. Ramalakshman Rao, aged 32years, Software Engineer, Permanent R/at Balajipeta (Village & Mandal) Vizianagaram District.

Please take notice the above E.P filed by the D.Hr Under Order XXI Rules 64 to 66 of C.P.C, and the Hon'ble Court was pleased to order notice to J.Dr under Rule 54 of C.P.C through this publication. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **27-03-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law

(By Order of the Hon'ble Court)
K. VEDAVATHI,
Advocate, Visakhapatnam.
Cell: 7396518669.